జీతాలు - జీవితాలు

నెలాఖరు రోజులు—

రోడ్డువెంట నడుస్తున్న సుందరరామయ్యగారిని గుడ్డల కొట్టువాడు కేకేశాడు.

పిలవటం ఎవరైనా విన్నారేమోనని చుట్టూచూచి చిన్నబుచ్చుకున్న ముఖంతో కొట్లోకెళ్ళేరు.

చెమటపట్టిన ముఖాన్ని తుడుచుకుంటూ స్టూలుమీద కూర్చున్నారు.

"ఏం పంతులుగారూ, మా కొట్టువేపు రావటం బొత్తిగా మానేశారు ?-"

"ఏదీ శేషాచలం ... కాలం కలిసిరావడం లేదు."

డిసెంబరు '66 జ్యోతిలో ప్రచురితము

"చిన్నమ్మాయి పెళ్ళికి గుడ్డలు తీసుకోరూ!:—"

"ఆ శుభసమయం ఇంకా రాలేదు శెట్టీ!... అయినా పాత బాకీ తీర్చకుండా మరో చోట యెట్లా గుడ్డలు తీసుకుం టాను చెప్పు?!—"

"ఏమిటో పంతులుగారూ ... బాకీ విషయం మిమ్మల్ని ప్రతిసారీ అడగాలంటే నాకే బాధగా వుంది."

"ఏం చేయను చెప్పు, నీ బాకీగురించే నా ఆలోచన, కానీ తీర్చగలిగే మార్గం కన్పించటం లేదు.

"ఒక్కసారిగా కాకపోయినా పది నెలల్లో పదికాస్తలు సర్దండి పంతులు గారు!—"

"నా బరువు నాకుమాత్రం తెలీదా చెప్పు. అసలు కంటె వడ్డీ పెరిగిపోతున్నదనే బాధ నన్ను మరీ పీక్కు తింటున్నది."

"వ్యాపారంలో నాకూ చెయ్యి మెసలాయింపు కాకుండా వుంది ... ఈ నెల్లో అయినా కాస్త సర్దుతారేమోనని, అడిగానని బాధ పడకండి!—"

"చూడు శేషాచలం! నీ మనసు నాకు తెలుసు. ఇదే మరొకరైతే..."

"దానిదేముంది లెండీ ... రోజులన్నీ వకే తీరుగా వుండవు!"

"ఆగినవాడివి ఎట్లాగూ ఆగావు-మరో నెల రోజులు కాస్త ఓపికపట్టు."

"సరే, కానీయండి."

"నే వస్తానూ !—" అనేసి నీరసించిన హృదయంతో రోడ్డుమీద మళ్ళీ నడక సాగించారు.

మనసులో ఆలోచనాపరంపరలు వేధిస్తున్నాయి. మూడేళ్ళ క్రితం పెద్దవాడికి ఉద్యోగం దొరికిందని తెలిసి వందరూపాయలు కొట్లో ఖాతాపెట్టి గుడ్డలు కట్టించిపంపారు. అప్పటికీ ఇప్పటికీ బాకీ అలాగే నిల్చిపోయింది. తన చేతగాని తనాన్ని వివరిస్తూ, డబ్బు సర్దవలసిందిగా కొడుక్కి ఎన్నో ఉత్తరాలు వ్రాశారు. డబ్బు పంపకపోగా ఉత్తరాలకు సమాధానంకూడా వ్రాయటం మానుకున్నాడు.

ఇల్లు చేరేసరికి చిన్నవాడికి జ్వరం తగిలిందని, వళ్ళు మసిలిపోతున్నదని భార్య చెప్పింది. సుందరరామయ్య మనసు బేజారైంది.

పిల్లవాడిని భుజంమీద వేసుకుని ఆస్పత్రికి పరుగెత్తారు సమయానికి డాక్టర్ లేడు. కొత్త కేసులు చూచేవేళ దాటిందని నర్సు చెప్పింది. పిల్లవాడి వంటిమీద చెయ్యివేశారు. జ్వరంతో వళ్లు మసిలిపోతున్న పిల్లవాడి విషయం చూడమంటూ నర్సుకు చెప్పి బ్రతిమాలేరు.

"ఏమిటండీ ? ఏం జరిగింది ?" వస్తూనే డాక్టర్ అడిగాడు.

"డాక్టర్ ! పిల్లవాడికి చాల సీరియస్‌గా ఉంది."

"మరేం భయంలేదు" అనేసి టెంపరేచర్ చూసి, ఇంజక్షన్ ఇచ్చాడు.

"డాక్టర్ ! జబ్బేమిటంటారు ? ..."

"అంతగా ఆదుర్దా పడవలసిన విషయం కాదు. రేపటికి జ్వరం తగ్గుతుంది."

పిల్లవాడి భవిష్యత్ మీద ఆశాకిరణం చూపించిన డాక్టర్‌కు ప్రతిఫలం కోసం జేబు చూచుకున్నారు కేవలం కొంత చిల్లర మాత్రమే కనిపించింది.

"క్షమించాలి డాక్టర్ ! మీ మేలు మర్చిపోలేను. మీ ఫీజు ఫస్టు తారీకున ఇచ్చుకుంటాను."

"ఈ కాస్త విషయాన్ని గురించి బాధపడకండి. వెళ్ళి రండి !"

బరువుగా ఇల్లు చేరుకున్నారు. పసివాడిని ఇంట్లో ఉంచి మనసు బాగోలేక పోవటంతో అట్లా బజారుకని బయల్దేరిన సుందరరామయ్యగారు పార్కు చేరుకున్నారు.

రేడియోలోంచి ఏవో వార్తలు విన్పిస్తున్నాయి.

బెంచీలమీద కూర్చున్న పెద్దమనుషులు పాలిటిక్సు నెమరేస్తున్నారు.

లోకం తెలీని పిల్లలు గోలచేస్తూ ఆడుకుంటున్నారు.

సుందరరామయ్యగారి మనసు బరువుగా దేన్నిగురించో ఆలోచిస్తోంది.

తీవ్రంగా ఆలోచిస్తున్న మస్తిష్కంలో ఆలోచన మెరుపులా మెరిసింది.

మధ్యాహ్నం ఆఫీసులో కలుసుకున్నవ్యక్తి జ్ఞాపకం వచ్చాడు.

ఒక చిరునవ్వు నవ్వి గట్టిగా గాలిపీల్చుకుని తల అడ్డంగా ఆడించారు.

పార్కులో జనం పల్చబడ్డారు.

బాగా పొద్దుపోయిం దనిపించటంతో ఇంటికి బయల్దేరారు.

స్నానం ముగించి పంచలో కూర్చున్న సుందర్రామయ్యగారిని భార్య భోజనానికి పిల్చింది.

"చూడు శాంతా! నాకు ఆకలిగా లేదు. నువ్వూ, పిల్లలూ కానీయండి."

"భోజనం మానేస్తే బాధ్యతలు తీరుతాయా చెప్పండి లేవండి... కొంచెం ఎంగిలి పడుదురుగాని..."

భార్య వడ్డిస్తూ "రెండో అమ్మాయిని పురిటికి తీసుకెళ్ళమంటూ అల్లుడు జాబు వ్రాశాడు. మీరు అటు ఆఫీసు కెళ్ళగానే ఇటు ఉత్తరం వచ్చింది. పనితొందర్లో మీతో చెప్పటమే మర్చిపోయాను" అంది.

గబగబా నాలుగు మెతుకులు గతికి "ఊఁ... మజ్జిగ పోయ్..." అన్నారు.

"అదేమిటండీ! అప్పుడే మజ్జిగా?"

"కడుపు నిండిందిగానీ, కానియ్"

జీవితంలో సుందర్రామయ్యగారు చేసే పనులన్నీ అసంతృప్తి గానేమిగలటం ద్వారా, హృదయం గాయపడటమే కాకుండా సంసారభారం పెరుగుతూ రావటం వారి దురదృష్టం.

పెద్దమ్మాయికి పెళ్ళిచేశారు. పట్టుమని సంవత్సరమైనా గడవకముందే పుట్టెడు దుఃఖాన్ని మూటగట్టుకుని వైధవ్యంతో తండ్రిపంచనే చేరింది.

రెండో అమ్మాయి విషయం చూడబోతే ప్రతి సంవత్సరం పురిటి ఖర్చులే కాకుండా సర్వం ఇక్కడినుంచే పంపాల్సి వస్తున్నది.

మూడోపిల్ల పెళ్ళికి ఎదిగి గుండెలమీద కుంపటిగా తయారైంది. కొడుకు పెద్దవాడై వుండి సంపాదిస్తూ దేనికి కొరగాకుండా ఉన్నాడు పసివాడు రోగిష్టివాడు.

ఇన్ని సమస్యలతో సంసారాన్ని ఏవిధంగా ఎక్కతీసుకు రావాలో సుందర్రామయ్యగారికి అర్థంకాకుండా వుంది.

తీరని మనోవేదన వారిని క్షణక్షణం క్రుంగదీస్తూనే వుంది.

ఆరుబైట వెన్నెల్లో మంచంమీద పడుకుని పర్యావసానం కోసం ఆలోచిస్తూ, దారీ తెన్నూ లేకుండా వున్న సంసారఘటసంపూరిత సమస్యలను గురించి నెమరేస్తున్నారు.

"ఎందుకండీ ఆలోచించి మనసు పాడుచేసుకుంటారు? దిగులుపడితే ప్రయోజన మేముంది చెప్పండి?—"

"పిచ్చిదానా! అసలు నాకు మనస్సంటూవుంటే గదా పాడుచేసుకునేటందుకు—"

"ఏమిటోనండి... ఈనెల్లో ఖర్చుమరీ ఎక్కువైనట్టుంది చేస్తున్న బాకీలు ఎట్లాతీర్చాలో అర్థంకాకుండా వుంది. పోయిన నెలలో పాలబాకీ అట్లాగేవుంది. బొగ్గులవాడు డబ్బుకోసం

ప్రతిరోజూ తిరిగి పోతున్నాడు. ఇంటావిడ క్రిందటినెల అద్దె బాకీ విషయం మళ్ళీ గుర్తుచేసింది."

"చావనా ఏమిటి? తెచ్చేదంతా కొంపకే పెడుతున్నానా? నే నేమన్నా కట్టుకుపోతున్నానా?... ఛ,ఛ... పాపిష్టి జన్మ! ఎందులోనైనా పడిచద్దామని వుంది."

"ఎందుకండీ అంత బాధపడతారు? నేను మాత్రం ఏమన్నాననని? ఎన్నాళ్ళీట్లా చాలీ చాలని జీతాలతో బ్రతుకులు గడపగలమాని—"

"మనం బ్రతికి వున్నన్నాళ్లూ... సరేనా! నువ్వెళ్ళి పడుకో, నా మనసేం బాగోలేదు."

శాంతమ్మ లేచి వెళ్ళిపోయింది.

సుందర్రామయ్యగారి మనసు మళ్ళీ అల్లకల్లోలమైంది. బాగా అలసిపోవడంతో కొంచెం కునుకు పట్టింది.

♦ ♦ ♦

తలుపు తట్టిన శబ్దం విన్పించటంతో లేచివెళ్ళి తలుపు తీశారు.

"నమస్కారమండీ!"

"ఆఁ... ఆఁ... నమస్తే! మీరు!"

"గోవిందయ్యాను. పొద్దున మిమ్మల్ని ఆఫీసులో కలిశాను చూచారూ..."

"ఓహోఁ... మీరా! రండి లోపలికి!—"

పంచలో వున్న కుర్చీల్లో కూర్చున్నారు.

"మీతో ఉదయం ఆఫీసులో మనవిచేశాను చూడండి ఆ విషయమే మీతో తీరుబడిగా మాట్లాడవచ్చని వచ్చాను"

"ఏ విషయం ?"

"అదే... బిల్లు విషయం !—"

"ఏ బిల్లు... ?"

"క్షమించండి. నా కాంట్రాక్టు తాలూకు ఎనభై వేల రూపాయల బిల్లుంది చూశారూ... దాన్నే లక్షకు సరిచేసి తెచ్చాను. తమరు కోప్పడకుండా బిల్లు ప్యాస్ చేశారంటే... మీ కష్టం వుంచుకోను."

"అంటే మీ వుద్దేశ్యం ?—"

"మరేంలేదండీ... కాస్తవేన్నీళ్ళకు చన్నీళ్ళు! అంతే! మీపరిస్థితి నాకు తెలుసు."

"అందుకని... నన్ను నేను వంచించుకోమంటారా?"

"క్షమించాలి ? మీమేలు మర్చిపోను..."

"ఇందుకా మీరు ఇంత రాత్రిసమయంలో వచ్చారు? నాసంగతి మీకు తెలీదేమో..."

"నాకంతా తెలుసు! తమరు కోప్పడకుండా వుంటే ఒక్క విషయం మనవి చేస్తాను."

"ఊఁ..."

"చిత్తం!... చూడండీ! ఈరోజుల్లో మీకుమల్లే మడి కట్టుకుకూర్చునేవా రెవరున్నారు చెప్పండి. ఎవరి మటుక్కు వాళ్లు సుఖపడాలనే స్వార్థంతో బ్రతుకులు చక్కదిద్దుకునే వారే! అందరిలాగే కాకుండా మనం ధర్మం, న్యాయం

అంటూ కూర్చుంటే బరువు బాధ్యతలుగల కుటుంబాలు వెళ్ళ మారేదెట్లా చెప్పండీ?"

"మరోసారి చెప్తున్నాను. నా మనస్సాక్షి అంగీకరించనిపని నే చేయను. కూటికి జరక్కపోతే పస్తులుండి చస్తానుగానీ... ఇలాంటి నీచానికి పాల్పడను."

"అట్లా అంటే యెట్లా చెప్పండీ?" అంటూ వంద రూపాయల నోట్లకట్ట సుందర్రామయ్యగారి చేతిలో వుంచి "ఇది వుంచండి" అన్నాడు.

"రామ! రామ! ఇలాంటి పన్లుచేసే వాళ్ళను నీచంగా చూచిన నేను..."

"క్షమించండి!— ఇంతటితోనే కాదు. నేను మళ్ళీ తమకు కన్పిస్తాను. నామాట వినండి. నాకు సాయంచేసిన వారూ అవుతారు. మీ కష్టాలూ గట్టెక్కుతాయి... మరి నే వెళ్ళొస్తాను" అని చరచరా వెళ్ళిపోయాడు.

సుందర్రామయ్యగారు చేతిలోవున్న నోట్లకట్టకేసి తీక్షణంగా చూశారు. గుండె వేగంగా కొట్టుకోనారంభించింది. కాళ్ళూ చేతులు వణకసాగాయి. డబ్బును వెంటనే భుజాన వున్న తుండులో దాచారు.

లేచివెళ్ళి వీధివాకిలి తలుపువేసివచ్చి నిద్రపోతున్న భార్యను తట్టి నిద్రలేపారు.

"ఏమిటండీ? ఏం జరిగింది?"

"ష్! అరవకు" అనేసి, ఇంట్లోకి నడవమంటూ సైగ చేశారు.

"శాంతా! ఈ డబ్బు జాగ్రత్తచెయ్?"

"అమ్మో! ఇంతడబ్బే! ఎక్కడిదండీ?"

"విషయం తర్వాత చెప్తాను. ముందు డబ్బు జాగ్రత్త చెయ్" అనేసి మళ్ళీ వాకిట్లోకొచ్చి మంచంమీద కూర్చునారు.

గుండె శబ్దవేగాన్ని అధిగమిస్తోంది.

వళ్ళంతా చెమట పట్టింది.

కూర్చున్నవారల్లా మంచంమీద పడుకుని రెండు చేతులూ గుండెలమీద పెట్టుకున్నారు.

చల్లగాలి వీస్తున్నా ప్రకృతిలో గాలి స్తంభించినట్టుంది.

జీవితంలో మొదటిసారిగా తృప్తిగా నవ్వుకున్నారు. అనుకోకుండా వచ్చిన డబ్బు ఎన్నో ఆలోచనల్ని ప్రేరేపిస్తున్నది.

ఇన్నాళ్ళూ పెళ్ళి చేయలేక బాధపడుతున్న సుజాత పెళ్ళి చేయచ్చనిపించింది. పాత బాకీ ఇవ్వమంటూ పదే పదే వత్తిడిచేసే శేషాచలం బాకీ తీర్చవచ్చు. పెద్దమ్మాయి సరోజకు మిషన్ నేర్పించి, ఒక స్వంత మిషనొకటి ఏర్పరిస్తే దాని బ్రతుకు అది బ్రతుకుతుం దనుకున్నారు.

ఇన్నిరోజులుగా తన హీనపరిస్థితి చూచి హేళన చేస్తున్న సహోద్యోగుల నోళ్ళు మూయించ వచ్చనిపించింది.

ఆలోచనల్ల రంగులరాట్నం మనసులో వేగంగా తిరుగుతోంది.

మళ్ళీ ఆలోచన... దాని వెనుక సమస్య... వాటి వెనుక భయం...

ఓమారు శ్వాస గట్టిగా పీల్చుకొని బరువుగా స్వగతంగా నవ్వుకున్నారు. ప్రస్తుతానికి కష్టాలు గట్టెక్కినట్టే అనుకున్నారు. భగవంతుడు తన కీపిథంగా సాయపడ్డందుకు అంతరంగంలో కృతజ్ఞత వెలిబుచ్చారు.

భయం మరొకవైపు క్రుంగదీయ నారంభించింది. తాను చేసింది నేరం! ఇన్నాళ్ళూ అందరూ చేసి సుఖపడ్తున్న పని ఇప్పుడు తను చేస్తే నేరమెట్లా అవుతుందీ అని మళ్ళీ అనిపించింది.

ఈ విషయం మరో కంటివాడికి తెలిస్తే? లేదా తనను పరీక్షించేందుకై ఎవరైనా పన్నిన పన్నాగమా? ఏదీ అర్థం కాకుండా ఉంది.

ఒకవేళ ఇది ప్లానే అయితే... భవిష్యత్ ఏంగాను! భార్యా పిల్లల గతేమవుతుంది? సంఘంలో తానొక నేరస్తుడిలాగ పరిగణింపబడతాడు... జైల్లో వేస్తారు... లంచగొండని ఉద్యోగంలోంచి తీసేస్తారు. అంతేగాదు... సమాజం నీచంగా చూస్తుంది.

చేసిన నేరానికి, ఎదుటివారి కుటిలపన్నాగానికీ సంసారం ఛిన్నాభిన్నమవుతుంది. తినో తినకో పరువుగా బ్రతికే సంసారం బజారుపాలవుతుంది.

ఇన్నాళ్ళూ ఏపనయితే చేయగూడదు, న్యాయవిరుద్ధం, అధర్మం అనే నీతి నియమాలతో, జీవితాన్ని అర్థానం

దంతో నెట్టుకొస్తున్నారో... అదే పని ఈనాడు చేశారు. ఏం, ఆమాత్రం స్వార్థం మనిషిలో వుండకూడదా అన్పించింది. సుఖపడే మార్గం కోసం మరో విధంగా చెయ్యి చాచటం అవినీతా? పైగా తనకై తనే లంచమియ్యమని యాచించ లేదే? అదృష్టమే ఈ రూపంలోవచ్చి తనను వరించిందని తృప్తిపడ్డారు.

కాదు... తాను చేసింది నేరం! అని అంతరాత్మ ఘోషిస్తున్నది. సంఘం దూషిస్తున్నది! సమాజం వెలేస్తున్నది! చట్టం శిక్ష విధిస్తున్నది!

మళ్ళీ తలుపు తట్టిన శబ్దమైంది.

ఆలోచనల్లనుండి తేరుకుని లేచివెళ్ళి తలుపు తీశాడు.

"సుందర్రామయ్య మీరేనా?—" అధికార స్వరం కఠినంగా ప్రశ్నించింది.

నోట మాట రాలేదు...

"మాట్లాడరేం?"

"నేనే!" హీనస్వరంతో సమాధానం వచ్చింది.

"అయితే మీ ఇల్లు సోదాచేయాలి" అనేసి ఇద్దరు కానిస్టేబిల్సతో లోపలికొచ్చాడు ఇన్స్పెక్టర్.

"హే! భగవాన్! ఏమిటీ పరీక్ష?" మనస్సులో గొణుక్కున్నాడు.

బీరువాలో చీరమడతల్లో వున్న డబ్బు బైటికితీస్తూ "మీకీ డబ్బెక్కడిది?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"నా... దే..."

"లంచం క్రింద తీసుకున్న డబ్బేగా"

"_____"

"మాట్లాడరేం ?"

"తెలీదు !"

"సరే. మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను" అనేసి చేతులకు బేడీలు తగిలించాడు.

దుఃఖం కట్టలు తెంచుకుంది.

"నే నాపని చెయ్యలేదు. చేయని నేరానికి శిక్ష నాకా! నామాట వినండి. ఇన్స్పెక్టర్, నిజాన్ని తెలుసుకోండి! నమ్మరా ? నన్ను నమ్మలేరా ? అయ్యో భగవంతుడా..." అంటూ బాధగా మూలుగుతూ మంచంమీద పడుకున్న సుందర్రామయ్యగారిని భార్య తట్టి నిద్ర లేపుతూ "ఏమండీ! ఏమిటి కలవరిస్తున్నారు ? ఏమండీ! మిమ్మల్నే..." అంది.

"ఆఁ... శాంతా!... ఏమిటి, పిల్చావా ?" కళ్ళు తెరిచి ప్రక్కకు వొత్తిగిల్లారు.

"అవునండీ! ఏమిటీ... నిద్రలో మీలో మీరు మాట్లాడుకుంటున్నారు !"

"ఏంలేదు శాంతా! జీవితం నన్ను బలహీనపరుస్తున్నది. నన్నూ, నా పరిస్థితిని చూచి డబ్బు వెక్కిరిస్తూ నన్ను బానిసగా చేసుకోవాలని చూస్తోంది... కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టు."

తెచ్చిన గ్లాసెడు నీళ్ళు గటగటా తాగేసి, ముఖాన్ని తుండుతో తుడుచుకుని "శాంతా, ఇలారా! నా ప్రక్కగా కూర్చో!"

"ఏమిటండీ?"

"చూడు శాంతా! నేను మంచివాడినే నంటావా?"

"భలేవారండీ! మీరు నిజంగా దేవుడు లాంటివారు. ఏం? ఎందుకట్లా అడుగుతున్నారు?"

"మరేం లేదు... నామీద నాకు నమ్మకం పోతు న్నది. పైగా పీడకలకూడ వచ్చింది."

"అనవసరంగా అధైర్యపడకండి! అన్నిటికీ భగవం తుడే వున్నాడు. కళ్లుమూసుకు పడుకోండి!"

"అంతే శాంతా... అంతే" అనేసి మళ్ళీ నిద్రకు ఉపక్రమించారు సుందరరామయ్యగారు.